


నా కొల్లీగ్ సాధారణంగా సినిమాల కెళ్ళడు. తెలుగే కాదు, ఏ భాషా చిత్రం కూడ అతన్ని ఆకర్షించదు. సినిమాల్లో ఏముంటుంది? నా పిండాకూడని విసుక్కుంటాడు. అట్లాంటి సినీ విరోధి గత వారమంతా సినిమాలు చూడటంతోనే గడిపేడు. రెండు థియేటర్లలో నాకూ్కడా కలిసేడు. పైగా అతను చూసినవన్నీ తెలుగు సినీమాలే. అతనిలో వచ్చిన ఈ అకస్మాత్తు మార్పు నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. అతని సినీ అనురాగం వెనక కథేమిటో తెలుసుకోవాలని అతన్నే అడిగేను. అతను చెప్పింది విని అదిరిపోయాను.

అతనికి మొన్నీమధ్యనే మగపిల్లవాడు పుట్టేడుట. వాడికి ఏం పేరు పెడితే బావుంటుందోనని మంచి పేర్లకోసం వెదుకుతున్నాట్ట. అందుకోసం తెలుగు నవలలు చదువుతున్నాట్ట. తెలుగు సినీమాలు చూస్తున్నాట్ట. ఎన్ని చదివినా, ఎన్ని చూసినా ఒక్క మంచి పేరూ (తనకి నచ్చినది) తగలడం లేదన్నాడు. అతని అవస్థ విని చాలా జాలిపడ్డాను. మీరు కూడా కథలవీ రాస్తారు గదా, మీకు తోచిన మంచి పేరొకటి చెప్పి పుణ్యం కట్టుకోండని నన్ను ప్రాధేయపడి అడిగేడు. నవ్వొచ్చింది నాకు. అడగ్గా, అడగ్గా నా కథల్లో పాత్రల పేర్లే అడిగినందుకు నొచ్చుకున్నాను. నా పాత్రల పేర్లన్నీ చాలా సాధారణంగా వుంటాయని చెప్పేను. అవి బహుశా అతనికి నచ్చవని కూడ హామీ యిచ్చేను.

* * * *

మన ఆశకొద్దీ పిల్లలకు ప్రముఖుల పేర్లు పెట్టుకుంటామేగాని వాళ్ళు పెరిగి పెద్దయిం తర్వాత ఆ పేరు నిలబెట్టుకుంటారో, నేలమట్టం చేసుకుంటారో అదంతా వాళ్ళ చేతుల్లోనే వుంటుంది. గాంధీగారి పేరు పెట్టుకున్నాం గదా, వీడు అపర మహాత్ము డవుతాడనే ధీమా తల్లిదండ్రులకుంటే వుండొచ్చు. వారు పెద్దయిం తర్వాత జేబులు కొట్టేసి జైళ్ళకు వెళ్ళిపోతున్నప్పుడు గాని, ఆ పేరుని ఎంత ఉద్ధరించేడో అర్థం కాదు.

తిక్కన సోమయాజని చిన్నప్పుడు నాకో క్లాసుమేటుండేవాడు. అదే క్లాసులో శ్రీకృష్ణదేవరాయలు కూడా వుండేవాడు. వాళ్ళకా పేర్లు వాళ్ళ తల్లిదండ్రులు ఏ ఆశతో పెట్టుకున్నారో నాకు తెలీదు. ప్రస్తుతం తిక్కన సోమయాజి మున్సిపాలిటీలోను, శ్రీకృష్ణదేవరాయలు కలెక్టరాఫీసులోనూ గుమాస్తాలుగా వుంటున్నారు. కవిత్వమ్మాట దేవుడెరుగు. కనీసం వాళ్ళు రాసే ఉత్తరాల్లో కూడా పిసరంత పాండిత్యం కనిపించదు. డిగ్రీలు తీసుకున్నారు. గనక వాళ్ళు ఇంగ్లీషులోనే ఉత్తరాలు రాస్తుంటారు. అయామ్ సేఫ్ హౌస్ ది సేమ్ విత్యూ అంటూ ఏదో లాగించేస్తారేగాని, ఒక్క వాక్యంలోనూ కిక్కుండదు. ఒరే తిక్కనా, ఒరే శ్రీనాథుడూ! మీకు ఆ పేర్లొద్దురా .... ఆ పేర్లు పెట్టుకుని ఆ పెద్దల్ని అవమానించకండిరా....

ఎంచక్కా సుబ్బారావనో, వెంకట్రావనో మార్చేసుకుని తిక్కనలనూ, శ్రీనాథులనూ రక్షించండిరాని పోరు పెడుతుంటారేగానీ, వాళ్ళు నా మాట వినిపించుకోవద్దూ?

అమ్మా నాన్న పెట్టిన పేరు ముద్దు పేరు, పెద్దయింతర్వాత గానీ అసలు పేరు తెలీదంటూ ఆత్రేయిగారే గాబోలు ఒక పాటలో రాసేరు. ఈ మాటెంతో నిజం మర్డర్ కేసులో యిరుక్కున్న ముద్దాయిని కోర్టు బంట్రోతు "జవహర్లాల్ నెహ్రూ .... జవహర్లాల్ నెహ్రూ....జవహర్లాల్ నెహ్రూ" అని పిలుస్తున్నప్పుడూ .... ఫలానా ఖూనీ కేసులో నిందితుడైన జవహర్లాల్ నెహ్రూకి ఉరి తీత అని పేపర్లో చదివినప్పుడూ మన గుండెల్లో శూలాలు దిగిపోతున్నట్టు ఫీలింగు కలుగుతుంది. అయితే ఆ ముద్దాయి తల్లిదండ్రులు అతనింత ఘనుడవుతాడని తెలీక ఘనంగా ఆ పేరు పెట్టి వుంటారు. సదరు ఆ వ్యక్తి పెరిగి, పెద్దవాడై యింతటి వాడవుతాడని వాళ్ళు వూహించి వుండరు. అందుచేత పిల్లలకి పేర్లు పెట్టేటప్పుడు జాగ్రత్త తీసుకోవడం తల్లిదండ్రుల బాధ్యత, కర్తవ్యం కూడాను.

కొందరు పెద్దయిం తర్వాత వాళ్ళ హోదా ముందు తమకి తమ తల్లిదండ్రులు పెట్టిన పేర్లు చాలా ఛీప్‌గా కనిపిస్తుంటాయి. బహుశా తామింత పెద్దవాళ్ళ మవుతామనే దూరదృష్టి తల్లిదండ్రులకు ఆ రోజుల్లో వుండకపోవచ్చు. అట్లాంటి సాధారణ పేర్లతో తాము పిలవబడటం చిరాగ్గా వుంటుంది. ఎంతో కొంత అవమానంగానూ వుంటుంది. తాను తెలుగు వాడైనా తన పేరుకు తెలుగుతనం శ్రీవారికి నచ్చదు. అంచేత తమ పేరుని అటూ యిటూ చిత్రికపట్టి పొడి అక్షరాలే రాయించుకుంటారు. ఆ పేరు చదివితే అతను బెంగాలీవాడో, తమిళ సోదరుడో పోల్చుకోడం కష్టం. అంతేగాని చచ్చినా అది తెలుగు పేరనుకోలేము. ఉదాహరణకి వెంకటేశ్వర రావు పేరు వి. ఆర్. గా రాసుకుని, చివర్లో ఇంటి పేరు తగిలించుకుంటే బంగారుగా వుండదూ? ఇట్లాంటి నేమ్ ప్లేట్లు ఢిల్లీలో బాగా తగుల్తుంటాయి. ఢిల్లీ అంటే నాగాయలంక కాదుగదా. మనందరం భారతీయులమనే పాయింటు తప్ప ఏ ప్రాంతంవారని అక్కడ ఎవరూ పట్టించుకోకపోవడం వల్ల ఇలాంటి ప్లేట్లు వెలిసేయని కొందరు వాదిస్తే .... పోదూ బడాయి....

ఫలానా గొప్పవాడు తెలుగువాడే సుమీ! అని మరో తక్కువ తెలుగువాడికి తెలిస్తే నామోషీగా వుంటుందని ఆ ఏర్పాటు చేసుకున్నారని మరికొందరు అభిప్రాయ పడుతున్నారు. ఏది ఏమైనా తల్లి దండులు పెట్టిన పేరు ఉతికేసి, ఆరేసి ఇస్త్రీ చేసుకోడం నా కెందుకో నచ్చదు.

మన హోదా ఏమిటో మరచిపోయి, మన పిల్లలకు ఫేషన్ పేర్లు పెట్టుకోవడం కూడా జరుగుతుంది. మనకి కారు, మేడ వుంటే మన పిల్లలకు నవీన్‌కుమారనో, శరజ్జోత్స్ననో పేర్లు పెట్టుకోవచ్చు. సాదా మనుషులం గదా, పిల్లలకి అల్లాంటి పేర్లు పెట్టి ప్రపంచంలోకి విసిరేస్తే ఆ తర్వాత సిగ్గుపడవలసి వస్తుంది. నవీన్‌కుమారుడు మూటలు మోయవచ్చు. శరజ్జోత్స్నదేవీ సర్వెంట్ మేడ్ కావచ్చు. ఇల్లాంటి ఇబ్బందులేమీ లేకుండా సత్యనారాయణనో, సూర్యనారాయణనో అందుబాటులో వుండే పేర్లు పెట్టేసు కుంటే పేచీ వుండదు. అతగాడు పెద్ద హోదాలో ఎదిగినా, చితికిపోయినా ఈ పేర్లు మేచింగ్‌గానే వుంటాయి ఇదే మాట మా కొల్లీగ్‌కి చెప్పేను. అతను వాళ్ళబ్బాయికి ఏం పేరు పెడతాడో చూడాలి మరి.